క్లుప్తంగా

రామతీర్థంలో ప్రత్యేక హోమాలు



యాగశాలలో హోమాలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో ఆదిత్య హృదయం, సుందరకాండ హవనం, తదితర హోమాలు జరిపించారు. అనంతరం లోక కల్యాణార్థం స్వామి వెండి మండపం వద్ద సీతారాముల నిత్య కల్యాణం చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు



వాయిద్యాలతో అమరవీరులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది

డెంకాడ: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ బ్యాండ్ పార్టీ సభ్యులు అయినాడ జంక్షన్ వద్ద ఆదివారం అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాయిద్యాలు వాయిస్తూ అమరుల సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషినల్ కమాండెంట్ జీవీ ప్రభాకరరావు, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రేఖ



డాక్టర్ కె రేఖ

విజయనగరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె. రేఖ నియమితులయ్యారు. విశాఖలోని డాక్టర్ వీఎస్ కృష్ణ కళాశాలలో బయోటెక్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీగా పనిచేసిన ఆమె పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు రేఖను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలపై విద్యుత్ భారం తగదు



ప్లకార్డులు చూపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

నెల్లిమర్ల రూరల్: ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపడం దారుణమని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని కొండగుంపాంలో ఆదివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని, సీఎం అయిన తర్వాత మాట మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సంపద సృష్టిస్తానని చెప్పి ప్రజల వద్ద నుంచి దోచుకోవడం సరికాదని దుయ్యబట్టారు. ప్రభుత్వం తక్షణమే విద్యుత్ సర్దుబాటు చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోలిపల్లి సూరి, రమణమ్మ, తవిటినాయుడు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10. 30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ పి. నల్లనయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు స్థానిక సమస్యలపై అర్జీలు అందించవచ్చని.. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

క్రీడాకారుడికి సన్మానం

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు వినయ్‌కుమార్‌ను స్థానిక శ్రీనివాస కాలనీ వాసులు ఆదివారం సన్మానించారు.కోచ్ ఆల్తి సత్తిబాబు మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకూ చెన్నై లో ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీలో నిర్వహించనున్న కబడ్డీ పోటీల్లో విజయనగరం జేఎన్‌టీయూ గురజాడ యూనివర్సిటీ నుంచి వినయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహించనున్నాడని చెప్పారు. పట్టణంలోని సీనియర్ కబడ్డీ క్రీడాకారులు బుగత వెంకటేశ్వరరావు, మళ్ల రామకృష్ణ, రేగలబంద చిట్టిబాబు, కె.శ్రీనివాసరావు తదితరులు వినయ్‌కుమార్‌ను అభినందించి, నగదు సహాయం చేశారు.

ఇకపై స్మార్ట్‌మీటర్లు..

- జిల్లాలోవిద్యుత్ కనెక్షన్లు 7,24,821
- ముందుగా కేటగిరీ–2 వారికి ఏర్పాటు
- ప్రభుత్వ కార్యాలయాలకు కూడా..
- జిల్లాలో కేటగిరీ –2 కనెక్షన్లు 65,104



స్మార్ట్ విద్యుత్ మీటరు

విజయనగరం ఫోర్ట్: ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో ఏపీఈపీడీసీఎల్ (ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తోంది. ఈ మీటర్లను ప్రాధన్యాతాక్రమంలో ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్‌లో బ్యాలెన్స్ అయిన తర్వాత ఏ విధంగా రీచార్జ్ చేసుకుంటామో అదేవిధంగా విద్యుత్ అయిపోయిన తర్వాత మరలా రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.

కేటగిరీ–2 కనెక్షన్లకు..

జిల్లాలో కేటగిరి విద్యుత్ కనెక్షన్లకు ముందుగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలకు కూడా స్మార్ట్ మీటర్లు బిగిస్తారు. దీని తర్వాత 200 యూనిట్లు విద్యుత్ వినియోగిస్తున్న గృహాలకు కూడా స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలన్నీ ప్రస్తుతం గృహవినియోగదారుల మాదిరిగా ప్రతి నెలా బిల్లులు చెల్లిస్తున్నాయి.

నెల వినియోగం 31 లక్షల యూనిట్లు..

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న మొత్తం విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి నెలకు 31 లక్షల యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు. దీనికి సంబంధించి రూ.1.86 కోట్లు వరకు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. అయితే చాలా వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండిపోవడంతో వసూలుకు విద్యుత్ శాఖ సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు.

7, 24, 821 కనెక్షన్లు..

జిల్లాలో 7,24,821 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో కేటగిరీ –1 కనెక్షన్లు 6,04,513.. కేటగిరీ–2 కనెక్షన్లు 65,194.. కేటగిరీ –3 కనెక్షన్లు 2822.. కేటగిరీ – 4 కనెక్షన్లు 14,168.. కేటగిరి –5 కనెక్షన్లు 38, 124 వరకు ఉన్నాయి.

ఉపయోగం ఏమిటి..

స్మార్ట్‌మీటర్లను యుద్ధప్రాతిపదికన ముందుగా ఏర్పాటు చేస్తారు. అనంతరం వీటిని స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లుగా మార్పు చేస్తారు. దీని వల్ల సెల్ ఫోన్ రీచార్జ్ మాదిరిగా రీచార్జ్ చేయించుకోవాల్సి ఉంటుంది. విద్యుత్ కూడా ఒక రోజుకి, నెలకు, గంటకు, ఏడాదికి సరిపడా రీచార్జ్ చేసుకోవచ్చు. ఈ విధానం వస్తే విద్యుత్ బకాయిల సమస్యే ఉండదు.

ప్రక్రియ ప్రారంభం..

కేటగిరీ –2 సర్వీస్‌లకు స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ కార్యాలయాలకు కూడా వీటిని ఏర్పాటు చేస్తున్నాం. ఇవి పూర్తి అయిన తర్వాత గృహ వినియోగదారులకు ఏర్పాటు చేస్తాం. ఈ మీటర్ల ఏర్పాటుతో బిల్లుల పెండింగ్ సమస్య ఉండదు.

ముువ్వల లక్ష్మణరావు, ఏపీఈపీడీసీఎల్, ఎస్ఈ

ఇవేం 'చెత్త' పనులు

- వాకింగ్ ట్రాక్ పక్కనే పూడికలు



వాకింగ్ ట్రాక్ పక్కన వదిలేసిన పంట కాలువలోని పూడిక వ్యర్థాలు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పది మంది నడిచే ప్రాంగణంలో రోజుల తరబడి పూడిక వ్యర్థాలు తొలగించకపోవడంపై ఆ ప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. నగరంలోని పద్మావతీనగర్ ప్రాంతంలో గల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పార్కు ఆవరణలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో స్థానికులు వాకింగ్ కోసం.. పిల్లలు ఆడుకునేందుకు వస్తుంటారు. అయితే 20 రోజుల కిందట పార్కు పక్కన ఉన్న పంట కాలువలో చేపట్టిన పూడికతీత పనుల్లో భాగంగా ఆ వ్యర్థాలను వాకింగ్ ట్రాక్‌పై వేసి వదిలేశారు. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, ఆహ్లాదాన్ని అందించాల్సిన పార్కు పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా జేసీబీ ద్వారా పనులు చేపట్టడంలో కాలువ వైపు గల వాకింగ్ ట్రాక్ బౌండరీ దెబ్బతింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కు పరిసరాలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మాకు గౌరవం ఏదీ..?

- ఎంపీపీని ప్రశ్నించిన టీడీపీ నాయకులు



ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావును నిలదీస్తున్న చింతలవలస టీడీపీ నాయకులు

డెంకాడ: నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి గెలుపునకు కృషి చేసిన తమను పట్టించుకోకుండా ఏకపక్షంగా పనులు మంజూరు చేయడం ఏమిటని జనసేన నాయకుడు, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావును చింతలవలస పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు ప్రశ్నించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ వాసుదేవరావును టీడీపీ నాయకులు ఎస్.అప్పలనాయుడు, తదితరులు నిలదీశారు. కూటమిలో భాగంగా తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా పనులు మంజూరు చేయడం తగదన్నారు. కూటమి పొత్తు ధర్మాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, జనసేన నాయకులు విస్మరించడంపై మండిపడ్డారు. ఎంపీపీ వాసుదేవరావు స్పందిస్తూ, విడతల వారీగా అన్ని వీధుల్లోను రోడ్లు నిర్మిస్తామని, అందరికీ పనులు కల్పిస్తామని చెప్పారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి

పూసపాటిరేగ: మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని కొవ్వాడలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, తీర ప్రాంతంలో ఉన్న గ్రామాలకు సముద్రం నుంచి ఉప్పునీరు చొరబడకుండా డెక్‌ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గ్రామాలలో డ్రైనేజీలు, సీసీ రహదారుల నిర్మాణానికి ఉపాధి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు బాలా అప్పలరాజు, కోట్ల రఘు, చనమళ్ల వెంకటరమణ, బంటుపల్లి వాసుదేవరావు, మహంతి శివ, జమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న జేసీ దంపతులు



జేసీ దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈఓ డీవీవీ. ప్రసాదరావు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని విజయనగరం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, పార్వతీపురం జేసీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.శోభిక దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదాశీస్సులతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బీఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

విజయనగరం టౌన్: బీఎస్ఎన్ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు ఈ నెల 28 నుంచి నవంబరు 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు బీఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరుగైన సేవలందించేందుకు జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్ సంస్థకు సంబంధించిన అవినీతిపై ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. వివరాలకు 08942–226700, 94416 68789 నంబర్లను సంప్రదించాలన్నారు.

చదురుగుడి ఆవరణలో మెట్ల పూజ



విజయనగరం క్రైమ్: పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో చదురుగుడి వద్ద ఆదివారం రాత్రి మెట్ల పూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీక్షాపరులు అమ్మవారిని స్తుతిస్తూ భజనలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో దీక్షాపరులకు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో గురస్వాములు ఎస్. అచ్చిరెడ్డి, బొంగ మహేష్, అధిక సంఖ్యలో దీక్షాపరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నటరాజ నృత్యాలయ చిన్నారుల ప్రదర్శన

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా చదురుగుడి ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. గుంటూరు జిల్లా మంగళగిరి కొప్పురావు కాలనీకి చెందిన శ్రీ నటరాజ నృత్యాలయం డ్యాన్స్ డైరెక్టర్ బి.తిరుమల కల్యాణి ఆధ్వర్యంలో విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యరూపకాలు భక్తిభావాన్ని పెంపొందించాయి. అనంతరం బాలాజీ భక్త సమాజం కె.వరలక్ష్మి బృందం ఆలపించిన అన్నమాచార్యకీర్తనలు అలరించాయి. రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడి ఆవరణలో పి.త్రినాథరావు భక్తిగీతాలాపన, గాదె వెంకట సుబ్బయ్య భజన సంకీర్తనలు, ఎ.రామ్‌ప్రసాద్, నైదాన రమేష్ ఏకపాత్రాభినయాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

నాటక రచనలో కాళిదాసు సిద్ధహస్తుడు

- రచయిత అయలసోమయాజుల గోపాలరావు



వక్త డాక్టర్ ఎ.గోపాలరావును సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: నాటక రచనలో కాళిదాసుసిద్ధహస్తుడని ప్రముఖ రచయి, వక్త అయలసోమయాజుల గోపాలరావు అన్నారు. విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అలంకారిక రచనా విధానం కాళిదాసు ప్రత్యేకతన్నారు. అనంతరం మహారాజా ప్రభుత్వ సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థినుల కాళిదాస శ్లోక పఠనం ఆలోచింపజేసింది. అనంతరం వక్తను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈఆర్ సోమయాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కె. కృష్ణమూర్తి, డాక్టర్ జక్కు రామకృష్ణ, రొంగలి పోతన్న, గుర్నాథరావు, ప్రాతా రాజేశ్వరరావు, ఈశ్వర్, బద్రి కూర్మారావు, శివరామకృష్ణ, దుర్గా ప్రసాద్, శిరీషా రఘురామ్, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, కె.సంతోషిలక్ష్మి, అధిక సంఖ్యలో సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● ప్రమాదకరంగా గుంకలాం రహదారి



ద్వారపూడి నుంచి గుంకలాం గ్రామానికి వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. మే నెలలో కుంగిపోయినా ఇంతవరకు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. గుంకలాం నుంచి విజయనగరం వైపు వచ్చే ఈ రహదారి మీదుగా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ కునుకు నాగరాజు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

- విజయనగరం రూరల్

వంతెనలు లేక ఇక్కట్లు

- గ్రామాల్లో గెడ్డలపై వంతెనలు లేక వర్షాకాలంలో రాకపోకలు బంద్
- వంతెనలు నిర్మించాలని ప్రజల వేడుకోలు



శాశనపల్లి–పెదవేమలి గ్రామాల మధ్య గెడ్డపై వంతెన నిర్మించాల్సిన ప్రాంతం ఇదే



అలమండ- జె.డి.వలస గ్రామాల మధ్య ఉన్న గెడ్డ

జామి: మండలంలోని పలుగ్రామాల మధ్య ఉన్న గెడ్డలు, వాగులపై వంతెనలు, కల్వర్టులు లేకపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అలమండ- జె.డి.వలస గ్రామాల మధ్య, శాశనపల్లి–పెదవేమలి మధ్య ఉన్న గెడ్డల వల్ల ఆయా గ్రామాల ప్రజలతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు వర్షాకాలంలో పూర్తిగా గ్రామాలకే పరిమితం కావాల్సి వస్తోంది. వర్షాకాలంలో ఈగ్రామాల మధ్య ఉన్న గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. ఇటీవల భారీవర్షాలు కు రిసిన సమయంలోనూ పూర్తిగా రాకపోకలు నిలిచి పోయాయి. శాశనపల్లి–పెదవేమలి మధ్య గెడ్డపై వంతెన లేకపోవడంతో శాశనపల్లి, పెదవేమలి, శిరి పురం, చంద్రంపేట, మురపాక తదితర గ్రామా ల వారికి ఇక్కట్లు తప్పడం లేదు. శాశనపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు పెదవేమలి ఉన్నత పాఠశా లకు వెళ్లాలంటే గెడ్డలో దిగాల్సిందే. గెడ్డ ఉధృతంగా వస్తే ఆరోజు పాఠశాలకు సెలవు పెట్టాల్సిందే. కుటుంబ సభ్యులు పిల్లలను భుజాలకు ఎత్తుకుని గెడ్డ దాటించిన సందర్భాలు వర్షాకాలంలో ఇక్కడ నిత్యకృత్యం. గ్రామాన్ని ఆనుకునే గెడ్డ ఉండడం వల్ల వరద నీరు కూడా గ్రామాన్ని చుట్టుముడుతోంది. అలమండ–జె.డి.వలస గ్రామాల వారి పరిస్థితి అంతే. అలమండ రైతుల పొలాలు గెడ్డకు అవతలివైపు ఉన్నాయి. వరద ఉధృతి ఉన్న స మయంలో వ్యవసాయ పనులకు పొలాలకు వెళ్లేందుకు అవకాశం ఉండడం లేదు.అలాగే అలమండ నుంచి జె.డి.వలస, గొడికొమ్ము, జామి గ్రామానికి వెళ్లేందుకు గెడ్డ మధ్యలో నుంచి ఉన్న రోడ్డే దగ్గర దారి. అయితే గెడ్డ ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పు డు మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే వేర్వేరు మార్గాలను వెతుక్కోవాల్సి వస్తోందని ఆ యా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వేసవిలో ఏ సమస్యా లేకపోయినా వర్షాకాలంలో మాత్రం ఈ మార్గాల్లో రాకపోకలు సాగించడం కత్తిమీద సామేనని అంటున్నారు. తమ ఇబ్బందులను గుర్తించి, గెడ్డలపై వంతెనల నిర్మాణాలకు అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



శాశనపల్లి విద్యార్థులను పెదవేమలిలోని హైస్కూల్‌కు భుజాలపై ఎత్తుకుని గెడ్డదాటిస్తున్న వారి కుటుంబ సభ్యులు (ఫైల్)

ఎదురుచూస్తున్నాం..



అలమండ గెడ్డపై ఎప్పుడు వంతెన నిర్మిస్తారా అని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. వర్షాకాలంలో రాకపోకలు సాగించేందు ఇబ్బందులు పడుతున్నాం. గ్రామానికి చెందిన రైతుల పొలాలు,కల్లాలు గెడ్డ అవతలివైపు ఉన్నాయి. గెడ్డలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు పొలాలకు కూడా వెళ్లలేకపోతున్నాం.

– బి.బంగారునాయుడు, అలమండ గ్రామం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామానికి పెదవేమలికి మధ్య ఉన్న గెడ్డపై వంతెన లేకపోవడం వల్ల మాతో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. వర్షాకాలంలో విద్యార్థులు పక్కగ్రామంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి. అత్యవసర సమయాల్లో అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి వంతెన నిర్మించాలి.

– బి.వెంకటఅప్పారావు, శాశనపల్లి గ్రామ సర్పంచ్

నివేదికలు పంపించాం

శాశనపల్లి గెడ్డపై వంతెన నిర్మాణానికి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. ఇక్కడ బ్రిడ్జి నిర్మించేందుకు రూ.6.10 కోట్లు అవుతుందని అంచనా వేశాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం. అలమండ–జె.డి.వలస గెడ్డపై వంతెన నిర్మాణ అంశం ఆర్ అండ్‌బీ పరిధిలోకి వస్తుంది.

– స్వామినాయుడు, పంచాయతీరాజ్ డీఈ